# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 350 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 27 ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# త్వరలో మరో 35 వేల పోస్టులు భర్తీ చేస్తాం

**2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తాం: రేవంత్ రెడ్డి**

**యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి**

**3 నెలల్లోనే 30 వేల మందికి నియామక పత్రాలు ఇచ్చామన్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్ పెన్ పవర్:** 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో మంచి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై... మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న తెలంగాణ అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట రూ.1 లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను రేవంత్ రెడ్డి నేడు పంపిణీ చేశారు. మెయిన్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సివిల్స్ ఉత్తీర్ణులై తెలంగాణ ప్రతిష్ఠను పెంచాలన్నారు. తెలంగాణ నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల కాలంలోనే 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని, మరో 35 వేల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలామంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేస్తామన్నారు.

## 'హైడ్రా' పని భేష్... రేవంత్ రెడ్డి వెనక్కి తగ్గొద్దు



- హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాపై ప్రశంసలు
- సీఎం రేవంత్ రెడ్డి పులిమీద స్వారీ చేస్తున్నారన్న నారాయణ

హైదరాబాద్ పెన్ పవర్:సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తాజాగా హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా చేస్తున్న పని భేష్ అని కొనియాడారు. "నగరంలో చెరువులు, నాలాలు కబ్జా చేయడం వల్ల వర్షపు నీరు ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి! అరగంట వర్షం పడితే ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయి నగరం ముంపునకు గురవుతోంది. ఆ సమయంలో ప్రజల అవస్థలు వర్ణనాతీతం.

వివరాలు 2లో..

## ఆమె మా ఎంపీనే.. ఆమె మాటలు పార్టీకి సంబంధం లేదు

### కంగనాపై బీజేపీ వెర్షన్



హైదరాబాద్ పెన్ పవర్: పంజాబ్, హర్యానా రైతులపై బీజేపీ ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. రైతుల ఉద్యమాన్ని బీజేపీ అడ్డుకోకపోయి ఉంటే.. ఇండియా మరో బంగ్లాదేశ్

వివరాలు 2లో..

## ప్రస్తుతం పెళ్లి ప్రణాళికలు లేవు... కానీ

### రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు



- ఇటీవల కశ్మీర్ విద్యార్థినులతో మాట్లాడిన రాహుల్ గాంధీ
- పెళ్లి గురించి కాంగ్రెస్ అగ్రనేతను ప్రశ్నించిన యువతి
- ఇప్పుడు ప్రణాళికలు లేవని... కానీ తోసిపుచ్చలేమని వ్యాఖ్య
- పెళ్లికి అందర్నీ ఆహ్వానిస్తానని రాహుల్ గాంధీ హామీ

వివరాలు 2లో..

## జమ్మూకశ్మీర్ ఎన్నికలు: నేషనల్ కాన్ఫరెన్స్ 51 ..కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ



హైదరాబాద్ పెన్ పవర్: జమ్మూకశ్మీర్ లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య సీట్ల పంపిణీ ఓ కొలిక్కి వచ్చింది. మొత్తం 90 అసెంబ్లీ సీట్లలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ 51చోట్ల పోటీ చేయనుంది. కాంగ్రెస్ పార్టీ 32స్థానాల్లో బరిలోకి దిగనుంది. మరో రెండు సీట్లను కూటమిలో భాగంగా ఉన్న సీపీఐఎం, పాంథర్స్ పార్టీకి ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. మరో ఐదు చోట్ల స్నేహపూర్వక పోటీ ఉంటుందని తెలిపారు. శ్రీనగర్ లోని %చీజ%చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఇంట్లో సీట్ల పంపకంపై సుదీర్ఘంగా చర్చలు

వివరాలు 2లో..

## 'ఎక్స్'లో ఖాతాను ప్రారంభించిన 'హైడ్రా'



- అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా
- ఎన్ కన్వెన్షన్ సహా పలు కూల్చివేతలతో హైడ్రా సంచలనం
- సోషల్ మీడియాలో అడుగు పెట్టిన హైడ్రా

హైదరాబాద్ పెన్ పవర్: ఇటీవల ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌తో పాటు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' సోషల్ మీడియాలో కాలు మోపింది. హైడ్రా... చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేపడుతోంది. ఇటీవల కూల్చివేతలతో సంచలనంగా మారిన హైడ్రా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ "ఎక్స్"లో ఖాతాను తెరిచింది. 'కమిషనర్ హైడ్రా' పేరుతో ఈ ఖాతాను ఓపెన్ చేసింది. గతంలో ఉన్న ఈడీవీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) ఖాతానే 'హైడ్రా'గా మార్చినట్లుగా భావిస్తున్నారు.

## జీడీపీ అంటే తెలియని తేజస్వి అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోంది

- అప్పుడు స్విట్జర్లాండ్‌లా కనిపించిన బీహార్ ఇప్పుడు హీనంగా కనిపిస్తోందా? అని ప్రశ్న
- నితీశ్ మళ్లీ మహా ఘట్‌బంధన్‌లో చేరితే అద్భుతంగా కనిపిస్తుందేమోనని ఎద్దేవా
- అసెంబ్లీ ఎన్నికల్లో 243 స్థానాల్లో పోటీ చేస్తామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్: జీడీపీ అంటే తెలి యని తేజస్వీ యాదవ్ బీహార్ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఎద్దేవా చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... కులం, దోపిడీ, మద్యం, మాఫియా, నేరాల గురించి తేజస్వి మాట్లాడితే ఏమైనా అనడానికి వీలుంటుందని, కానీ వాటికి బదులు

వివరాలు 2లో..

## తెలంగాణలో సీజనల్ వ్యాధులపై కీలక డేటా విడుదల

- జనవరి 1 నుంచి ఆగస్ట్ 25 వరకు 5,372 కేసులు నమోదు
- హైదరాబాద్‌లో 1,852 హైరిస్క్ డెంగ్యూ కేసులు నమోదు
- 152 చికెన్ గున్యా, 191 మలేరియా కేసులు నమోదైనట్లు వెల్లడి




హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో సీజనల్ వ్యాధులపై హెల్త్ డిపార్టుమెంట్ కీలక డేటాను విడుదల చేసింది. ఈ క్యాలెండర్ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన డెంగ్యూ కేసు వివరాలను వెల్లడించింది. జనవరి 1వ తేదీ నుంచి

వివరాలు 2లో..

## ఆక్రమణల కూల్చివేత అంశంలో ఎవరిపైనా కక్ష సాధింపు లేదు

- చెరువుల ఆక్రమణపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్న మంత్రి
- ఆక్రమణకు గురైన చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి
- పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:చెరువుల ఆక్రమణ, కూల్చివేతల అంశంలో ప్రభుత్వానికి ఎవరి పైనా రాజకీయ కక్ష సాధింపు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలపై ఆయన మాట్లాడుతూ... చెరువుల ఆక్రమణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. ఆక్రమణకు గురైన చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. చెరువులకు సంబంధించి ప్రభుత్వ లెక్కలు, రికార్డులు ఉన్నాయని, ఆ మేరకు ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలవనరులను రక్షించుకోవాల్సి ఉందన్నారు. చెరువుల రక్షణపై స్థానికులే ముందుకు రావాలన్నారు. ఆక్రమణలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్నారు. హైడ్రాకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.



## రేవంత్ రెడ్డి దూకుడుతనమే ఆయనకు ఇబ్బందికరంగా మారే అవకాశం



- పాతబస్తీలోనూ చెరువులు కబ్జాకు గురయ్యాయన్న బీజేపీ నేత
- ఒవైసీ కాలేజీని కూల్చే దమ్ముందా? అని సవాల్
- ఇతర అంశాలను పక్కదారి పట్టించేందుకే హైడ్రాకు హైప్ తెచ్చారని ఆరోపణ

హైదరాబాద్ పెన్ పవర్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న దూకుడుతనమే ఆయనకు ఇబ్బందికరంగా మారే అవకాశముందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... పాతబస్తీలోనూ చెరువులు కబ్జాకు గురయ్యాయని, వాటిని తొలగించే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా? అని ప్రశ్నించారు. చెరువును కబ్జా చేసి ఒవైసీ కాలేజీని నిర్మించారని, ఆ కాలేజీని కూల్చేస్తారా? అని సవాల్ విసిరారు. మజ్లిస్ పార్టీతో

వివరాలు 2లో..

# సంపాదకీయం

## మోడీ ఆశలు ఫలించేనా

రష్యా-యుక్రెయిన్ యుద్ధాన్ని మోదీ ఒక్కరు ఒంటి చేత్తో ఆపగలరా..? ఇదంతా జరిగే పనేనా..? ఇలా ప్రపంచవ్యాప్తంగా రకరకాల వాదనలు. నిజానికి రెండు దేశాలు యుద్ధంలో పీకల్లోతు మునిగిపోయాయి. ఇరువైపులా చెప్పుకోలేనంతగా తీవ్రమైన నష్టం వాటిల్లింది. పైగా వాటికి ఏదో ఒక పక్కన చేరి ఆయుధాలు, ఆర్థికసాయం అందిస్తూ కొట్టుకుచావండని ఎంకరేజ్ చేసే దేశాలే అన్నీ. కానీ భారత్ అలా చేయలేదు. అందరూ బాగుండాలి.. అందులో మనముండాలన్నట్లు.. మధ్యవర్తిత్వం చేసేందుకు ముందడుగు వేసింది. కోపంతో రగులుతున్న కళ్లలో శాంతి, కరుణ చూడాలని ఆలోచిస్తోంది. అది సక్సెస్సవుతుందా..? ఫెయిలవుతుందా..? అనేది తర్వాత.. కనీసం ఆదిశగా ప్రయత్నమైనా చేస్తున్నారు ప్రధాని మోదీ. యుద్ధం.. అది మిగిల్చే విషాదం .. దాన్ని మాటలకు వర్ణించలేం. ప్రస్తుతం రష్యా-యుక్రెయిన్‌ది అదే పరిస్థితి. ఒకరు వెనకడుగు వేయరు.. ఇంకొకరు వెనక్కి తగ్గేదేలేదంటారు. కానీ బలవుతోంది మాత్రం ప్రజలు, సైనికులు. ఈ జనరేషన్ ఎప్పుడూ చూడని యుద్ధవిధ్వంసాన్ని అటు రష్యా-యుక్రెయిన్ , ఇటు పాలస్తీనా , ఇజ్రాయెల్ చవి చూశాయి. ఇవి మెల్లగా ప్రచ్ఛన్న యుద్ధంగా ఆవిర్భవిస్తుందేమోనన్న అనుమానాలు పీక్స్‌కు చేరాయి. అలాంటి సమయంలో భారత్ ఐక్యరాజ్యసమితి నుంచి.. జీ20 సదస్సు, జీ7 సమ్మిట్ వరకు అడుగడుగునా శాంతి కోసమే పరితపిస్తూ వచ్చింది. 2022లో మొదలైన యుద్ధం.. ఇంకా కొనసాగుతోంది. ఎవరి స్వార్థప్రయోజనాల కోసం వాళ్లు ఆయా దేశాల జట్లలో చేరిపోయారు. కానీ.. భారత్ అలా చేయలేదు. తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని తేటతెల్లం చేసింది. వార్ వల్ల ఆస్తి, ప్రాణనష్టం తప్పితే అభివృద్ధి ఉండదని.. కోలుకోవడం కష్టమని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ఆపాలనే ఉక్రెయిన్ అధ్యక్షుడిని 2023 మేలో జపాన్‌లో జరిగిన ఉ-7 శిఖరాగ్ర సమావేశంలో మోదీ జెలెన్‌స్కీని తొలిసారి కలిసినప్పుడు చెప్పారు. రష్యా, యుక్రెయిన్ యుద్ధం మొదలైనప్పట్నుంచి.. ఇప్పటివరకు నాటో దేశాలు తప్ప మరే ఇతర దేశం కూడా యుక్రెయిన్‌లో పర్యటించలేదు. ఆ విధంగా చూస్తే మోదీ వేసిన ముందడుగు ఎంతో ప్రత్యేకమైందనేది అంతర్జాతీయ రాజకీయాలను విశ్లేషిస్తున్నవాళ్లు చెబుతున్నమాట. ష్యా ? యుక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమై రెండున్నరేళ్ళు కావొస్తోంది. రెండు దేశాలు చాలా తీవ్రంగానే ఆస్తి, ప్రాణనష్టాన్ని చవిచూశాయి. అగ్రదేశాలన్నీ ఈ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నాయే కానీ.. ఎవరూ శాంతి చర్చల దిశగా అడుగులు వేయలేదు. ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశానికి పుతిన్ ఆహ్వానంతో.. ఈ ఏడాది జులై 8న మాస్కోలో పర్యటించారు ప్రధాని మోదీ. ఈ టూర్‌లో పుతిన్ -మోదీ ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఇది ప్రపంచ దేశాల్లో అనేక ప్రశ్నలకు తావిచ్చిందిపుతిన్, మోదీ కలిసిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదే సమయంలో ఈ టూర్‌పై యుక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యుక్రెయిన్‌పై వరుసగా దారుణాలకు పాల్పడుతున్న రష్యాతో.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ అంత సన్నిహితంగా ఉండటమేంటని ప్రశ్నించారు. మోదీ, పుతిన్ ఫ్రెండ్లీ హగ్ రోజే కీవ్‌లోని పిల్లల ఆసుపత్రిపై రష్యా దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ పోస్ట్ పెట్టారు జెలెన్‌స్కీ. ఆ సమయంలో భారత్ వైఖరిని యుక్రెయిన్ తప్పు పట్టిందన్న ప్రచారం జోరుగా జరిగింది. నిజానికి రష్యా అధ్యక్షుడితోనూ మోదీ శాంతి చర్చలే జరిపారు. రష్యా-యుక్రెయిన్ వార్ విషయంలో, భారత్ చాలా స్పష్టమైన, స్థిరమైన వైఖరినే కొనసాగిస్తోంది. దౌత్య చర్చల ద్వారానే ఈ ఘర్షణ పరిష్కారమవుతుందని తెలిపింది. అప్పుడే శాంతి నెలకొంటుందని తేల్చి చెప్పింది. అందుకే, చర్చలు అత్యంత అవసరమని భావించినట్లు మోదీ పుతిన్ ముందు స్పష్టం చేశారు. ఇప్పుడు నెల రోజుల వ్యవధిలోనే జెలెన్‌స్కీతో యుక్రెయిన్‌లో సమావేశమయ్యారు. ఆయనతోనూ యుద్ధం వద్దని వారించే ప్రయత్నమే మోదీ చేశారు. ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన మార్గాల ద్వారా మాత్రమే శాంతి స్థాపన సాధ్యమవుతుందని కుండబద్దలుమోదీ యుక్రెయిన్ పర్యటనపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ పర్యటనతో యుద్ధం ముగుస్తుందని ఆశిస్తున్నట్లు భావిస్తున్నామన్నారు. చాలా మంది దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలు ఉక్రెయిన్ వెళ్లారు. కానీ భారత ప్రధాని టూర్ ఘర్షణకు ముగింపు పలకాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు.. మోదీ పర్యటనతో ఎంతోకొంత మార్పును ఆశించొచ్చని ప్రపంచదేశాలు కూడా ఎదురుచూస్తున్నాయని. యుక్రెయిన్ టూర్‌కు ముందు నుంచే ఆ దేశాన్ని యుద్ధం విరమించమని సూచించేలా సంకేతాలు పంపుతూ వచ్చారు భారత ప్రధాని. యుక్రెయిన్ కంటే ముందు పోలాండ్‌లో పర్యటించారు. అక్కడ కూడా మోదీ శాంతి, స్థిరత్వం, దౌత్యం, స్నేహంపైనే ఎక్కువగా మాట్లాడారు. సంక్షోభ సమయంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం మొత్తం మానవ జాతికే పెద్ద సవాలుగా మారుతోందన్నారు. తాము శాంతి, స్నేహం కోసం ఎవరితోనైనా చర్చలకు మద్దతిస్తున్నామని స్పష్టం చేశారు. యుద్ధభూమిలో ఏ సమస్యకూ పరిష్కారం ఉండదని తాము బలంగా విశ్వసిస్తున్నామన్నారు. ఇటు పోలాండ్‌తో బలమైన సంబంధాలను కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. అదే సమయంలో వ్యాపార, ఇతర వాణిజ్య, ఆర్థిక సంబంధాలపైనా చర్చించారు. మేకిన్ ఇండియా, మేక్ ఫర్ వరల్డ్ నినాదం వినిపించారు. కలిసి నడుస్తూ.. పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

# ప్రస్తుతం పెళ్లి ప్రణాళికలు లేవు... కానీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతానికి వివాహ ప్రణాళికలు ఏమీలేవని... అలా అని వాటిని తోసిపుచ్చలేమని ఏఐసీసీ అగ్రనాయ కుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇటీవల జమ్ము కశ్మీర్‌లో పర్యటించిన ఆయన శ్రీనగర్‌కు చెందిన విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ యువతి పెళ్లి గురించి అడిగారు. యువతులతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ... పెళ్లి చేసుకోవాలని మీ పెద్దల నుంచి ఒత్తిడి వస్తుందా? అని అడిగారు. ఈ సమయంలో ఓ యువతి మీరు వివాహం

ఎప్పుడు చేసుకుంటారని ఎదురు ప్రశ్నించింది. దానికి రాహుల్ గాంధీ నవ్వుతూ సమాధానం చెప్పారు. ఇరవై ముప్పై ఏళ్ల నుంచి ఈ ఒత్తిడిని అధిగమిస్తూ వస్తున్నానన్నారు. ఇప్పుడు పెళ్లి ప్రణాళికలు లేనప్పటికీ, కొట్టి పారేయలేమన్నారు. ఈ సమయంలో విద్యార్థులు జోక్యం చేసుకొని, పెళ్లి చేసుకుంటే తమను పిలవాలని కోరారు.

తప్పకుండా అందర్నీ ఆహ్వానిస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ అగ్రనేత తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

# ఆమె మా ఎంపీనే.. ఆమె మాటలు పార్టీకి సంబంధం లేదు

- మొదటి పేజీ తరువాయి

అయ్యి ఉండేదంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. హర్యానా ఎన్నికలకు ముందు.. బీజేపీ ఎంపీగా కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ పార్టీ డిఫెన్స్ లో పడింది. డ్యామేజ్ కంట్రోల్ కోసం లేఖలు విడుదల చేస్తుంది. పూర్తి వివరాల్లోకి వెళితే...

రైతులు తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమం చేస్తున్నారు. ఈ ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రౌతు సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆమె వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ పెద్దలు ఆమె వ్యక్తిగతమని పార్టీకి సంబంధం లేదని తేల్చిచెప్పారు. సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ అనే సూత్రాల ఆధారంగా అందరినీ కలుపుకొనిపోయేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు.

**బీజేపీ ఎంపీ కంగనా ఏమందంటే....**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు వ్యవసాయ చట్టాలకు నిరసనగి రైతులు దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నారు. మండిలో జరిగిన రైతు ఆందోళనపై బీజేపీ ఎంపీ కంగనా రౌతు ఎక్స్? ట్విట్టర్? లో స్పందిస్తూ.. రైతుల ఉద్యమం కారణంగా అత్యాచారాలు.. హత్యలు జరుగుతున్నాయన్నారు. అయి తే ఈ ప్రకటనను బీజేపీ పార్టీ తప్పుపడుతుంది.

**కాంగ్రెస్? స్పందన..**

ఇక కంగనా వ్యాఖ్యలను కాంగ్రెస్? పార్టీ స్పందించింది. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాటే తీవ్రంగా వ్యతిరేకించారు. భారత దేశానికి సంబంధించిన అంతర్గత వ్యవహారాల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకుంటున్నాయని మోదీ ప్రభుత్వం భావిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆమె ప్రశ్నించారు. రైతుల ఉద్యమాన్ని అవమానపరుస్తూ... అసభ్యకరమైన పదజాలం ఉపయోగించి రైతులను దూషించే విధంగా మాట్లాడటం బీజేపీ ఎంపీ కంగానాకు తగదన్నారు. ఎంపీ కంగనా తప్పుడు ఆరోపణలు చేసినట్లు రుజువైతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

రైతులను హంతకులుగాను... అత్యాచారం చేసే వారిగా పోల్చడంపై బీజేపీ ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్? నాయకురాలు సుప్రియా డిమాండ్? చేశారు.

# జమ్మూకశ్మీర్ ఎన్నికలు: నేషనల్ కాన్ఫరెన్స్ 51 ..కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ

- మొదటి పేజీ తరువాయి

జరిగాయి. కాంగ్రెస్ తరుపున ఆ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సీనియార్ నేత సల్మాన్ ఖుర్షీద్ చర్చల్లో పాల్గొన్నారు. ఎన్సీ తరుపున ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాతో పాటు ముఖ్య నేతలు పాల్గొన్నారు. మరో వైపు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల కేటాయింపు బీజేపీకి పెద్దసమస్యగా మారింది. ఫస్ట్, సెకండ్ లిస్టులలో టిక్కెట్లు దక్కని నాయకుల అనుచరులు ఆందోళనకు దిగారు. ఎన్నో ఎళ్లుగా బీజేపీ కోసం పనిచేస్తున్న తమను కాదని..

రెండ్రోజుల క్రితం పార్టీలో చేరినవారికి టిక్కెట్లు ఇవ్వడం సరికాదన్నారు. బీజేపీ అభివృద్ధికి పాటుపడినవారికి టిక్కెట్ ఇవ్వాల్సిందేనంటూ..?

జమ్మూలోని బీజేపీ ఆఫీస్ ముందు నిరసనకు దిగారు. దీంతో జమ్మూలోని కాషాయ పార్టీ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత నెలకొంది.

# ఆరు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు

### తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు

### గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం

### ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో రానున్న ఆరు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 29 నాటికి తూర్పు మధ్య, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఆగస్టు 26, 27 తేదీల్లో ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది తెలిపింది. 27వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. మగంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

28వ తేదీ నుంచి 29వ తేదీ మధ్య ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

29 నుంచి 30వ తేదీ మధ్య ఆదిలాబాద్ కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

30 నుంచి 31వ తేదీ మధ్య ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశముందని తెలిపింది.

ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

31వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ మధ్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది.

### తెలంగాణలో సీజనల్ వ్యాధులపై

# కీలక డేటా విడుదల

- మొదటి పేజీ తరువాయి

నిన్న... ఆగస్ట్ 25 వరకు 5,372 కేసులు నమోదైనట్లు తెలిపింది. ఇందులో హైరిస్క్ డెంగ్యూ కేసులు కూడా ఉన్నట్లు తెలిపింది. హైరిస్క్ డెంగ్యూ కేసులు హైదరాబాద్‌లో 1,852, సూర్యాపేటలో 471, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 426, ఖమ్మంలో 375, నల్గొండలో 315, నిజామాబాద్‌లో 286, రంగారెడ్డిలో 232, జగిత్యాలలో 185, సంగారెడ్డిలో 160, వరంగల్‌లో 110 డెంగ్యూ కేసులు నమోదైనట్లు వెల్లడించింది.

తెలంగాణలో చికెన్ గున్యా కేసులు 152, మలేరియా కేసులు 191 నమోదైనట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించగా 1.42 కోట్లకు పైగా ఇళ్లను వైద్య బృందం సందర్శించింది. ఈ సర్వేలో 2.65 లక్షల మందికి పైగా జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు.

# రేవంత్ రెడ్డి దూకుడుతనమే ఆయనకు ఇబ్బందికరంగా మారే అవకాశం

- మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ సఖ్యతతో ఉంటోందని, అలాంటప్పుడు ఒవైసీ కాలేజీని ఎలా కూలగొడతారన్నారు. ఇతర అంశాలను పక్కదారి పట్టించేందుకే హైడ్రాకు అంతగా హైప్ తీసుకువచ్చారని ఆరోపించారు. కూల్చివేతల గురించి జనం చర్చించుకుంటే ఇతర అంశాల గురించి మాట్లాడుకోరని వారు భావిస్తున్నారన్నారు. అందరికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఏలేటి ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి, మంత్రులు తలోరకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎంతమందికి రుణమాఫీ అయింది? ఇంకా ఎంతమందికి కావాల్సి ఉంది? చెప్పాలన్నారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారని, కానీ మంత్రులేమో రూ.17 వేల కోట్లు మాత్రమే అయ్యాయని అంటున్నారని విమర్శించారు. ఇందులో ఎవరి మాటను నమ్మాలని అడిగారు.

# 'హైడ్రా' పని భేష్... రేవంత్ రెడ్డి వెనక్కి తగ్గొద్దు

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చి మంచి పని చేసింది.

అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పులిమీద స్వారీ చేస్తున్నారు. ఆయన ఎట్టిపరిస్థితుల్లో పులి మీద నుంచి దిగకూడదు. దిగితే మింగేసే ముప్పు పొంచి ఉంది. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులు కబ్జా చేసి కార్యాలయాలు నడుపుతున్నాయి. ఈ అంశంపై చర్చించేందుకు రాష్ట్ర సర్కార్ అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. ఇక హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూడా కూల్చివేస్తున్నారు. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలి" అని చెప్పుకొచ్చారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకత్వంలోని కేంద్రంపైనా తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపేయేతర రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని దుయ్యబట్టారు. అదానీకి సెబీ సలాం కొడుతుందని, ఈ వ్యవహారంపై జేపీసీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### జీడీపీ అంటే తెలియని తేజస్వి అభివృద్ధి గురించి

# మాట్లాడుతుంటే నవ్వొస్తోంది

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి నమూనా గురించి మాట్లాడితే నవ్వు వస్తోంద న్నారు. గత పదిహేనేళ్లుగా వారు అధికారంలో ఉన్నారని, కానీ తేజస్వికి మాత్రం జీడీపీ అంటే తెలియదన్నారు. ఆయన ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్విట్జర్లాండ్‌లా కనిపించిన బీహార్ ఇప్పుడు హీనస్థితిలో కనిపిస్తోందా? అని ధ్వజమెత్తారు. నితీశ్ కుమార్ తిరిగి మహా ఘట్‌బంధన్‌లో చేరితే మళ్లీ రాష్ట్రం అద్భుతంగా కనిపిస్తుందేమోనని ప్రశాంత్ కిశోర్ ఎద్దేవా చేశారు. రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపుతామన్నారు.

# బావ, బామ్మర్దుల సవాల్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ శ్రీకాకుళం, ఆగస్టు 26 :** వరసకు బామ్మర్దులు.. రాజకీయాల్లో రాటుదేరినవారు.. ఆ ఇద్దరూ ఇప్పుడు గట్టి ప్రత్యర్థులు. వారే ఆముదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం. రవికుమార్ కి.. సొంత బావ తమ్మినేని. తోడబుట్టిన వాణిని రవి కుమార్ సీతారాంకిచ్చి వివాహం జరిపించారు. అలాగే సీతారాం సొంత అక్క రవికుమార్ తల్లి. ఒకప్పుడు అందరూ కలిసి మెలిసి ఉండేవారు. ఆముదాలవలస నియోజకవర్గ రాజకీయాలను శాసించేవారు.తెలుగుదేశం పార్టీలో తమ్మినేని సీతారాం ఒక వెలుగు వెలిగారు. ఎమ్మెల్యేగా 4 సార్లు, మంత్రిగా ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేసిన అనుభవం కూడా ఉంది. ఎక్కడ పొరపొచ్చాలు వచ్చాయో కానీఇద్దరినీ రాజకీయంగా విడదీసింది.. కుటుంబాలుకూడా వేరుపడ్డాయి.. కొంతమంది సీతారాంవైపు.. మరికొందరు రవికుమార్ వైపు చెదిరిపోయారు.. గత పదిహేనేళ్లుగా ఇద్దరూ వేరువేరు పార్టీలలో ఉంటూ ఒకరి మీద ఒకరురాజకీయ కత్తులు దూసుకుంటున్నారు. తమ్మినేని గడిచిన రెండు దశాబ్దాలలో కేవలం ఒకసారిమాత్రమే గెలిస్తే కూన రవికుమార్ రెండు సార్లు గెలిచారు. అయితే అంతకు ముందు ఆముదాలవలసలో నాలుగు సార్లు గెలిచిన చరిత్ర తమ్మినేనికి ఉంది. మంత్రి పదవులూ చేపట్టారు. జిల్లాలో ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారు. రాజకీయంగా సీనియర్ గా తమ్మినేని ఉంటే, టీడీపీలో రవికుమార్ రాజకీయంగా రాటుదేలారు.ఇటీవల ఎన్నికల్లో ఆముదాలవలస నుంచి బావను ఓడించి మంచి మెజారిటీతో ఎమ్మెల్యే పీఠం దక్కించుకున్నారు. అయినప్పటికీ వారి మధ్య అనేక విషయాల్లో అభిప్రాయాలు అలుముకుంటున్నాయి. ఎన్నికల ముందు విభేదించిన రవికుమార్ ఇప్పుడు తాజాగా తమ్మినేని అక్రమాల చిట్టాను బయటకు తీసే పనిలో ఉన్నారు. తమ్మినేని తప్పుడు డిగ్రీపైసమగ్ర దర్యాప్తు కోసంస్పెషల్ టీంనే నియమించాలనిప్రభుత్వాన్ని కోరారు. సీఐడీ చేత విచారణ జరిపించాలని రవికుమార్ ఫిర్యాదు చేశారు. తమ్మినేనివి ఫేక్ డిగ్రీ సర్టిఫికేట్లు అని అంతే కాకుండా ఆస్తులకూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించినగొప్పతనం ఆయనదే అని రవికుమార్ అంటున్నారు. 7 ఆస్తుల విషయంలో తమ్మినేనిఫేక్ దాక్యుమెంట్లు సృష్టించారని ఆ లెక్కలు అన్నీతేల్చే పనిలో రవికుమార్ కంకణంకొట్టుకున్నారు.ప్రభుత్వం దృష్టికి అన్నివిషయాలు తీసుకొస్తున్నారు. తమ్మినేని అక్రమాల చిట్టా అంతా తన వద్ద ఉందని ఆయన మీద పూర్తి విచారణ వేసి నిగ్గుతేల్చేందుకు అంతా సిద్ధం చేశామని రవికుమార్ ప్రకటించారు. తమ్మినేని వర్సెస్ రవికుమార్ గా ఆముదాలవలసలో సాగుతున్న ఈ రాజకీయ క్రీడ ఆసక్తిగా మారింది.రాజకీయంగా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ మాజీ స్పీకర్ తమ్మినేని ఒక వైపు.. దూకుడు రాజకీయాల్లో తనకు సాటి ఎవరూ లేరని పేరు తెచ్చుకున్న బావమరిది రవికుమార్ మరో వైపు ఉన్నారు. ఉన్నట్టుండి ఎన్నికల అనంతరం ఒక్కసారిగా ఆముదాలవలసలో ఈ రాజకీయ విస్ఫోటనం వెనక కుటుంబ కథా చిత్రం పైకి రావడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.గతం నుంచి కూడా బావా బామ్మర్దుల తగాదా ఒకరికొకరు తిట్టుకోవడంతోనే సరిపోయేది గతంలో కూన రవికుమార్ ఎమ్మెల్యేగా, విప్ గా ఉండేవారు. ఆముదాలవలస నియోజకవర్గంలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలోనే తమ్మినేని సీతారాం మీద కూడా ఎన్నో ఇబ్బందులు పెట్టారని.. అందుకే అధికారంలోకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత తమ్మినేని సీతారాం కూడా స్పీకర్ గా పవర్ ఫుల్ గా ఉండడంతో కూన రవికుమార్ పై కూడా ఎన్నో కేసులు పెట్టించారని ఆరోపణలు ఉన్నాయి.అప్పట్లో కోన రవికుమార్ అధికారులని తిట్టడంతో పెద్ద దుమారమే లేపింది. స్పీకర్ గా ఉన్న తమ్మినేని సీతారాం ఉన్నతాధికారులతో మాట్లాడి రవికుమార్ ను ఎలాగైనా సరే అరెస్టు చేయాలని చెప్పేసి కూడా ఆదేశాలు జారీ చేశారని టాక్ ఉంది. అప్పుడు కూన ముందస్తు బెయిల్ తెచ్చుకొని మళ్లీ రాజకీయం యథావిధిగా కొనసాగించారు. ఇప్పుడు మళ్లీ కూన రవికుమార్ – సీతారాం మధ్య మరింత వైరం పెరిగింది.

========================

## ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ కు త్వరలో శంఖుస్థాపన: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్, తిరుపతి ఆగస్టు 26 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనమేరకు ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ కు త్వరలో శంఖుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. 2014-19 చంద్రబాబు నాయుడు పాలనలో పురాతనమైన సెంట్రల్ బస్టాండ్ స్థానంలో ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మించాలని నిర్ణయించారని .ఆయన తెలపారు. కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్టాండ్ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో బస్టాండ్ నిర్మాణం జాప్యమైందని ఆయన చెప్పారు. ఎన్ హెచ్ ఎల్ ఎం ఎల్ సిఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరక్టర్ పూజా మిశ్రాలను ఆదివారం సాయంత్రం ఆర్టీసి గెస్ట్ హౌస్ లో ఎమ్మెల్యే ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ డిజనైస్ పై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సిఈఓ ప్రకాష్ గౌర్ ఎమ్మెల్యే కు వివరించారు. డిజైన్స్ ఆమోదించిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని సిఈఓ తెలిపారు. నవంబర్ లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి మార్చిలో నూతన బస్టాండ్ పనులకు శ్రీకారం చుట్టుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యంమత్రిగా తిరిగి రావడంతో తిరుపతివాసుల చిరకాల వాంఛ నెరవెరనుందని ఆయన చెప్పారు. ప్రయాణికులు, భక్తులకు ఆధునాతన సౌకర్యాలతో నూతన బస్టాండ్ రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. ఈ భేటిలో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి తదిరత అధికారులు పాల్గొన్నారు.....

# సిక్కోలులో శివమణి...

**క్రైం బ్యూరో పెన్ పవర్ ఉత్తరాంధ్ర, ఆగస్టు 26:** శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చర్చనీయాంశమవుతున్నారు. మనిషి కాస్త పలచగా కనిపిస్తున్నా నిర్ణయాలు తీసుకోవడంలో మాత్రం గట్టిగానే ఉంటున్నారు. ఎస్పీగా మొదటి పోస్టింగ్ కావటం, యువరక్తం ఉరకలవేస్తుండటంతో తన మార్క్ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జనాల్లోకి మరింత వెళ్లేలా ట్రై చేస్తున్నారు. ఒకవైపు నేరాల అదుపు చేసే ప్రయత్నాల్లో ఉంటూనే డిపార్ట్‌మెంట్‌లోని గంజాయి మొక్కలను గుర్తించి వారికి ట్రీట్మెంట్ ఇస్తున్నారు. ఐపీఎస్ ట్రైనింగ్, ఆ తరువాత మావోయిస్టుల ఏరివేత ప్రక్రియలో ఓఎస్డిగా పని చేశారు మహేశ్వరరెడ్డి. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు వేరు కావడంతో కాస్త తడబడుతున్నారు. మహేశ్వరరెడ్డి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే డిపార్ట్మెంట్లోని 'చేతివాటం' అధికార్లపై దృష్టి పెట్టారు. ఉన్నతాధికారులకు తొత్తులుగా ఉంటూ పోలీస్ స్టేషన్లను సెటిల్మెంట్ కేంద్రాలుగా మార్చేసిన ఎస్ఐలు, సీఐలను గుర్తించి గట్టి వార్నింగ్‌లే ఇస్తున్నారు. తమకు బదిలీ వేటు తప్పదని గ్రహించి ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉంటున్నారు. అయితే ఏ స్టేషన్లో ఉన్నా ఎస్పీ పర్యవేక్షణలోనే ఉండాలి కనుక కాస్త జాగ్రత్తగా ఉంటున్నారు. రికమండేషన్స్‌తో పోస్టింగ్స్ తెచ్చుకుంటున్న వారు ఆటలు కూడా ఎస్పీ ముందు సాగడం లేదని టాక్. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తూ..బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వారిని చూసి పోలీస్ సబ్ డివిజన్‌లలో కూడా వినతులు స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. జిల్లా కేంద్రానికి బాగా దూరంగా ఉన్న ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల బాధితులకు అందుబాటులో ఉండేలా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో వినతులు స్వీకరించాలని డిసైడ్ అయ్యారు. ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు స్వయంగా హాజరై ప్రజల ఇబ్బందులు వినబోతున్నారు మహేశ్వరరెడ్డి. ప్రతి శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి అందుబాటులో ఉంటానని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, వజ్రపుకొత్తూరు, మందస, పలాస, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి



మండలాల ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీకాకుళం జిల్లా సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక గస్తీకి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ప్రతి కాలేజీకి వెళ్లి యువతతో నేరుగా మాట్లాడుతున్నారు ఎవరికైనా ఏదైనా సందేహం ఉంటే ఫోన్ చేయండి అంటూ శివమణి స్టైల్‌లో నెంబర్ ఇస్తున్నారు. మామూలు తీసుకునే సిబ్బందిని టార్గెట్ చేస్తూ వస్తున్నారని తెలుస్తోంది. అక్రమాలకు అలవాటు పడిన సిబ్బందిని టార్గెట్ చేయడంపై పొలిటికల్ ప్రెజర్ మహేశ్వర్‌రెడ్డిపై పడుతోందట. వాళ్లు ఎస్పీకి ఫోన్ చేస్తే సరే చూద్దాం సార్ అని కూడా చెప్పి నిందితులకు మాత్రం ట్రీట్మెంట్ ఇచ్చే పంపిస్తున్నారని అంటున్నారు. జిల్లాకు ఎంతోమంది ఎస్పీలు వచ్చి వెళ్లారు కానీ మహేశ్వర్‌రెడ్డి స్పెషల్ అంటున్నారు కొందరు ఖాకీలు. ఎస్పీ సార్ వస్తున్నారు అంటే చాలు స్టేషన్లో ఏ స్టేషన్ కి వెళ్తారో తెలియదు. సడన్‌గా ఏదో స్టేషన్‌కు వెళ్లి అక్కడ బాధితులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇది లోకల్ సిబ్బందిని కూడా అలర్ట్ చేస్తోంది. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి సరఫరాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారని అంటున్నారు. మొత్తానికి కుర్ర ఎస్పీ సిక్కోలులో కొత్త శివమణిలా మారిపోయారని అంటున్నారు.

# 4 ఏళ్లు.. 60 వేల కోట్లు.. అమరావతి లెక్క ఇది




**స్టేట్ పొలిటికల్ బ్యూరో పెన్‌పవర్ విజయవాడ, ఆగస్టు 26:** అమరావతి పనులు పునః ప్రారంభంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. రాజధాని పరిధిలోని అన్ని నిర్మాణాల పనులు 4 సంవత్సరాలలోపు పూర్తిచేసేందుకు ప్రణాళిక చేస్తుంది. ఐఐటీ మద్రాస్, హైదరాబాద్ నిపుణులు అమరావతి రాజధానిపై నివేదికను వచ్చే వారంలో సమర్పించే అవకాశం ఉంది. అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా... శాసనసభ భవనం, హైకోర్టు, సెక్రటేరియట్ భవనం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆలిండియా అధికారులు, ఇతర అధికారుల కోసం గృహ సముదాయాలు, రాజధాని నగర రోడ్ల నిర్మాణం, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించడం, మురుగు నీటి కాలువలు, వరద కాలువలు, పార్కులు, వినోద కేంద్రాలు/పర్యాటక ప్రాజెక్టులు, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. అమరావతి రాజధాని ప్రాజెక్టులను అమరావతిలో మాత్రమే కాకుండా, విజయవాడ, మంగళగిరి, గుంటూరులోని సీఆర్డీఏ ప్రాంతంలో నిర్మించనున్నారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. డిసెంబర్ 1 నుంచి రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. రూ.60 వేల కోట్ల వ్యయంతో చేపట్టే నిర్మాణాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేస్తామన్నారు. మధ్య ఆగిపోయిన నిర్మాణాలను ముందుగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. అమరావతి రాజధానికి వచ్చేవారికి ఆహ్లాదాన్ని అందించేలా బ్లూ, గ్రీన్ కాన్సె?ప్ట్ తో టూరిస్ట్ ప్రాజెక్టులను చేపడతామని మంత్రి నారాయణ తెలిపారు. శనివారం మంత్రి నారాయణ, అధికారులు అమరావతి ప్రాంతంలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రాజధానిలో 4 పెద్ద పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే 6 నెలల్లో మెగా పార్కులను అందుబాటులోకి తెస్తామన్నారు. శాఖమూరులో 300 ఎకరాల్లో సెంట్రల్ పార్కు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ మహానగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన ఓ సీనియర్ అధికారికి అమరావతిలో ప్రాజెక్టుల అభివృద్ధి బాధ్యతలను అప్పగించామన్నారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండలో సుందరమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి టూరిస్ట్ కేంద్రం తీర్చిదిద్దుతామన్నారు. శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మిస్తామన్నారు. నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని అమరావతిని గ్రీన్ అండ్ బ్లూ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.. ఏపీ ప్రభుత్వం. ఉద్యానవనాలు, జలాశయాలతో కళకళలాడే విధంగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున పార్కుల నిర్మాణం జరుగుతోంది. తద్వారా రాజధాని ప్రాంతంలో గ్రీనరీతో పాటు ఆక్సిజన్ శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకోసం పెద్ద ఎత్తున ఉద్యానవనాలు నిర్మించేందుకు సన్నద్ధమైంది.ప్రపంచంలో టాప్-5 నగరాల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు మంత్రి నారాయణ. అలాగే రాజధాని ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేందుకు నాలుగు పార్కులు నిర్మిస్తున్నామన్నారు. శాఖమూరులో 300 ఎకరాల విస్తీర్ణంలో సెంట్రల్ పార్క్‌తో పాటు రిజర్వాయర్ నిర్మిస్తున్నామని అలాగే అనంతవరం, మల్కాపురంలో పార్క్‌ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఆరు నెలల్లోనే వీటి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణంపై శరవేగంగా అడుగులు వేస్తోంది.. కూటమి ప్రభుత్వం. వైసీపీ పాలనలో పడకేసిన రాజధాని పనులను..తిరిగి గాడిన పెట్టే చర్యలను చేపట్టింది. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, రాష్ట్ర సచివాలయం ముందు 21 ఎకరాల్లో మల్కాపురం పార్క్ నిర్మాస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నిలిచిపోయిన రాజధాని నిర్మాణాలపై ఐఐటీ మద్రాస్, హైదరాబాద్ బృందాలు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టాయని, సెప్టెంబరు మొదటి వారంలో నివేదిక ఇస్తాయని చెప్పారు.

## టీడీపీ ఖాతాలోకి మాచర్ల మున్సిపాలిటీ




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ గుంటూరు, ఆగస్టు 26:** మాచర్లలో సీన్ మారుతోంది. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్ వచ్చిన రోజే షాక్ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా, స్థానిక సంస్థల్లో బలంగా ఉన్నామనుకున్న వైసీపీ పీఠాలు ఒక్కొక్కటిగా కదిలిపోతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్షంగా ఏకగ్రీవం చేసుకున్న మున్సిపాలిటీ అనూహ్యంగా కూటమి ఖాతాలో చేరిపోయింది. ఒక్క సభ్యుడూ లేని టీడీపీ.మాచర్ల మున్సిపాలిటీపై జెండా ఎగరేయడమే రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.మాచర్ల? పల్నాడు ప్రాంతంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు చిరునామా.రాష్ట్రం మొత్తం ఎన్నికలు ఒక ఎత్తైతే? మాచర్లలో పోలింగ్ అంటేనే వేరే లెవెల్. దాడులు, దౌర్జన్యాలు, హింసాకాండ మాచర్లలో చాలా.. చాలా? కామన్‌గా చెబుతుంటారు.. గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్దా వెంకన్న ప్రయాణిస్తున్న కారుపై జరిగిన దాడే మాచర్లలో దౌర్జన్యకాండకు నిదర్శనమని అంటుంటారు.ఇక ఆ తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ మాచర్ల మున్సిపాలిటీని ఏకపక్షంగా ఏకగ్రీవం చేసుకుంది. మున్సిపాలిటీలో మొత్తం 31 స్థానాలు ఉండగా, మొత్తం 31 చోట్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరులే కౌన్సిలర్లుగా గెలిచారు. ఆ తర్వాత ఏడాదికి ఒకరు చొప్పున మున్సిపల్ చైర్మన్లుగా వ్యవహరించాలని నిర్ణయించారు...2020లో ఎన్నికలు జరిగితే, తొలిసారి టీడీపీ నేతలపై దాడి కేసులో నిందితుడు తురకా కిశోర్‌ను చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఆ తర్వాత బోయ రఘురామిరెడ్డి మున్సిపల్ చైర్మన్ అయ్యారు. వీరి తర్వాత మూడో చైర్మన్‌గా ఏసోబు బాధ్యతలు స్వీకరించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన రాజీనామా చేశారు.ఇప్పుడు ఆయన స్థానంలో వైసీపీకి చెందిన మరో నేతను ఎన్నుకోవాల్సి వుండగా, టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చక్రం తిప్పడంతో మాచర్ల మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో చేరిపోయింది. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న పోలూరి నరసింహారావును చైర్మన్ చేశారు ఎమ్మెల్యే జూలకంటి. టీడీపీలో చేరిన కౌన్సిలర్లు అంతా పోలూరికి మద్దతివ్వడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది.మున్సిపాలిటీలో టీడీపీకి ఒక్క సభ్యుడూ లేకపోయినా, పసుపు జెండా రెపరెపలాడటం హాట్‌టాపిక్‌గా మారింది. అందులోనూ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్ వచ్చిన రోజే షాక్ ఇచ్చింది టీడీపీ. వైసీపీకి చెందిన 16 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకుని మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది టీడీపీ. మున్సిపాలిటీలో 31 మంది సభ్యులకు గాను 16 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీసియో హోదాలో ఎమ్మెల్యే ఓటు కలిసిరావడంతో టీడీపీ ఖాతాలో చేరింది మాచర్ల మున్సిపాలిటీ.ఇక మిగిలిన కౌన్సిలర్లలో ఒకరు వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరు అవడంతో వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిధంగా టీడీపీ నేతలపై దాడి కేసులో నిందితుడైన మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్ అజ్ఞాతంలో ఉన్నారు. ఇక మరికొందరు కౌన్సిలర్లు టీడీపీ లేదా జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారంటున్నారు. దీంతో మున్సిపాలిటీలో టీడీపీ మరింత బలపడే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు.మాచర్ల అంటే వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అడ్డాగా చెప్పేవారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయనకు ఎదురేలేదన్నట్లు పవర్ చూపించే వారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మాచర్లలో పిన్నెల్లి చెప్పిందే శాసనం అన్నట్లు నడిచేది. ఇక ఆయనకు ప్రత్యర్థిగా గత ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బాధ్యతలు స్వీకరించిన నుంచి పిన్నెల్లికి కౌంట్‌డౌన్ మొదలైందనే టాక్ ఉంది. బ్రహ్మారెడ్డి రంగంలోకి దిగిన తర్వాత మాచర్లలో టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఆత్మస్థైర్యం వచ్చింది.గత ఎన్నికల్లో పిన్నెల్లికి దీటుగా నిలవడంతోపాటు, పకడ్బందీగా పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో సక్సెస్ అయ్యారు. దీంతో అసాధ్యమనుకున్న గెలుపును సుసాధ్యం చేసుకోవడమే కాకుండా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని కోలుకోని విధంగా దెబ్బతీశారు. ఎన్నికల హింస కేసులో ఆయన అరెస్టు అవ్వగా, ఆయన సోదరుడు ఇప్పటికీ పరారీలో ఉన్నారు. దీంతో మాచర్లలో వైసీపీ కార్యకర్తలు చెల్లా చెదురయ్యారు. ఇక ఇదే సమయంలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి చాకచక్యంగా పావులు కదిపి మాచర్ల మున్సిపాలిటిలో పసుపు జెండా రెపరెపలాడించారు.ఒక్క మాచర్ల మున్సిపాలిటీయే కాదు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. వారంతా కండువాలు మార్చేయడానికి రెడీగా అంటున్నారట.. ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీలో కొనసాగడం కష్టంగా భావిస్తున్న నేతలు? పార్టీ ఫిరాయించేందుకు తహతహ లాడుతున్నట్లు చెబుతున్నారు.ఐతే మున్సిపాలిటీని దక్కించుకున్న హుషారులో ఉన్న టీడీపీ కొన్ని మండలాల్లో ఎంపీపీ పదవులను కైవసం చేసుకోడానికి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఐతే, వైసీపీ అధికారంలో ఉండగా, టీడీపీ నేతలు, కార్యకర్తలతో వివాదాలకు దిగిన వారిని మాత్రం దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. మొత్తానికి మాచర్లలో స్థానిక సంస్థల పీఠాలు అన్నీ కదిలిపోతున్నాయి. వైసీపీ ఖాతా నుంచి టీడీపీ ఖాతాలో చేరిపోనున్నాయనే టాక్ వినిపిస్తోంది.

## వైసీపీ నేతల రాసలీలల కథలు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కాకినాడ, ఆగస్టు 26:** ఓ గోరంట్ల మాధవ్.. ఓ దువ్వాడ శ్రీనివాస్. ఇప్పుడు లేటెస్ట్‌గా అనంతబాబు. వైసీపీ నేతల్లో ఒక్కొక్కరిది ఒక్కో లెక్క. వీళ్లెవరు అంచనాలకు అందరనే చెప్పాలి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో కథ. కాదు.. కాదు.. రాసలీల కథ.ఇది లేటెస్ట్‌గా వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సంబంధించి లీక్ అయిన వీడియో. ఓ మహిళతో వీడియో కాల్ మాట్లాడుతూ.. అసభ్యంగా ప్రవర్తించిన వీడియో ఇది. ఈ వీడియోను లీక్ చేసింది అధికార తెలుగుదేశం పార్టీ. అంతేకాదు ఈ వీడియోని ట్యాగ్ చేస్తూ తీవ్ర విమర్శలు చేసింది టీడీపీ. జఅఖ అంటే యువజన శృంగార రసిక పార్టీ అంటూ సెటైర్లు వేసింది.నిజానికి అనంతబాబు ఇలా వార్తల్లోకి రావడం ఇది తొలిసారి కాదు. గతంలో ఓ దళిత వ్యక్తిని హత్య చేసి డోర్ డెలివరీ చేసినట్టుగా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడేమో వీడియో కాల్ మాట్లాడుతూ తన పర్సనల్ ప్రైవేట్ పార్ట్స్ చూపిస్తూ నానా హంగామా చేశారు. ఈ వీడియోను ఎవరు రికార్డ్ చేశారో తెలీదు కానీ.. ప్రస్తుతం టీడీపీ రిలీజ్ చేసింది.. ఇప్పుడిది వైరల్‌గా మారింది. దీంతో వైసీపీ మరోసారి ఇరుకున పడిందనడంలో ఎలాంటి డౌట్ లేదు. నిజానికి దళితుడి హత్య ఇష్యూ తర్వాత ఆయనపై వైసీపీ సస్పెన్షన్ వేటు వేసింది. కానీ ఆయన జైలు నుంచి వచ్చిన మళ్లీ మాములుగానే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మళ్లీ ఇప్పుడేమో ఇలా మరోసారి పరువు పోగొట్టుకున్నారు అనంతబాబు.అనంతబాబే కాదు.. గతంలో గోరంట్ల మాధవ్‌ది కూడా ఇదే తంతు. గతంలో ఆయన కూడా ఓ మహిళతో న్యూడ్‌గా వీడియో కాల్ మాట్లాడారు. ఈ వీడియో కూడా అప్పట్లో వైరల్‌గా మారింది. దీంతో అప్పుడు తీవ్ర కలకలమే రేగింది. బాధ్యతగల ఎంపీ పదవిలో ఉండి.. ఇలా అసభ్యంగా ప్రవర్తించడమేంటని తీవ్ర విమర్శలు వచ్చాయి. వెంటనే ఆయన రాజీనామా చేయాలన్న డిమాండ్స్ కూడా వినిపించాయి. ఆయనపై కూడా వైసీపీ వేటు వేసింది.ఇక లెటెస్ట్‌గా దువ్వాడ శ్రీనివాస్ ఇష్యూ. ఆయన భార్య శ్రీనుకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టడం. సీన్‌లోకి మాధురి ఎంట్రీ ఇవ్వడం.. ఆయనకు మద్దతు పలకడం.. ఇలా కథ రకారకాల మలుపులు తిరిగింది. దీంతో ఆయన పరువు బజారుపాలైంది. దీంతో ఆయనకు ఇచ్చిన జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది వైసీపీ.ఇలా ఒకరి తర్వాత ఒకరు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు వైసీపీ నేతలు. అయితే లెటెస్ట్ వీడియోపై అనంతబాబు రియాక్టయ్యారు. తనపై కుట్ర జరుగుతుందని.. ఇది మార్ఫ్‌డ్ వీడియో అంటున్నారు.అంతేకాదు ఈ వీడియోను చూపించి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారంటూ కూడా ఆరోపిస్తున్నారు. ఎవరి మాటలు ఎలా ఉన్నా.. ఎవరి ఆరోపణలు ఏవైనా.. ప్రస్తుతం ఈ వీడియో మాత్రం నెట్టింట్లో చాలా వైరల్‌గా మారింది. వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలైతే మొదలయ్యాయి.

# టీమిండియాలో స్థానం కోసం ఆ ముగ్గురు మధ్య తీవ్ర పోటీ



ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా బుచ్చి బాబు టోర్నమెంట్ ఆగస్టు 15 న ప్రారంభమైంది. అయితే టోర్నీ అసలు కళ రేపటి నుంచి మొదలు కానుంది. స్టార్ ప్లేయర్లు ఉన్న ముంబై జట్టు మంగళవారం (ఆగస్టు 27) తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. సర్ఫరాజ్ ఖాన్ కెప్టెన్సీలో ముంబై జట్టు టిఎన్‌సిఏ ఎలెవన్ తో మ్యాచ్ ఆడనుంది. ముంబై తరపున సూర్య కుమార్ యాదవ్, శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతున్నారు. ఈ ముగ్గరికి ఈ టోర్నీ కీలకంగా మారనుంది. సెప్టెంబర్ 19 నుంచి స్వదేశంలో భారత్.. బంగ్లాదేశ్ తో రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడనుంది. భారత టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకోవాలంటే దేశవాళీ కీలకం కానుంది. బుచ్చి బాబు టోర్నీతో పాటు దులీప్ ట్రోఫీలో ఎవరు ఆడితే వారు భారత జట్టులోకి ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే బీసీసీఐ అధికారుల్లో ఈ విషయాన్ని ధ్రువీకరించినట్టు తెలుస్తుంది. సూర్య కుమార్ యాదవ్, శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్ లలో ఒక్కరికే టెస్ట్ స్క్వాడ్ లో స్థానం దక్కనుంది. దీంతో ఈ టోర్నీలో ఈ ముగ్గురు చెలరేగడం ఖాయంగా కనిపిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో ముంబైకి 42వ రంజీ ట్రోఫీ టైటిల్‌ను అందించిన కెప్టెన్ అజింక్య రహానే ఈ టోర్నీకి దూరమయ్యాడు. ఈ వెటరన్ ప్లేయర్ ప్రస్తుతం ఇంగ్లండ్ వన్డే కప్ లో లీసెస్టర్‌షైర్ తరపున ఆడుతున్నాడు. షామ్స్ ములానీ,అంగ్రిక్ష్ రఘువంశీ ఈ టోర్నీకి అందుబాటులో ఉండడం లేదు. ముంబయికి సర్ఫరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సూర్య టెస్ట్ క్రికెట్ పై ఇటీవలే తన ఆసక్తిని వెల్లడించగా.. శ్రేయాస్, సర్ఫరాజ్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.

# పాకిస్థాన్‌లో క్రికెట్‌కు ఏమైంది.. బంగ్లాపై ఓటమితో పీటర్సన్ షాక్




సొంతగడ్డపై మ్యాచ్.. ప్రత్యర్థిగా పసికూన జట్టు.. తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోర్.. రావల్పిండి వేదికగా జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ కు ముందు ఇదీ పాకిస్థాన్ పరిస్థితి. అయితే చివరి మూడు రోజుల్లో పాక్ జట్టు పూర్తిగా గాడి తప్పింది. మొదట బ్యాటింగ్ లో విఫలమై బంగ్లాకు ఆధిక్యాన్ని ఇచ్చారు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ లో చేతులెత్తేశారు. దీంతో బంగ్లాదేశ్ పై 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చూశారు. ఈ ఓటమిపై ఇంగ్లాండ్ మాజీ స్టార్ ప్లేయర్ కెవిన్ పీటర్సన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. పాకిస్తాన్‌లో క్రికెట్‌కు ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గతంలో తాను పాకిస్థాన్ సూపర్ లీగ్ లో ఆడిన విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. తాను పీఎస్ఎల్ ఆడుతున్నప్పుడు ఆ లీగ్ కు మంచి ఆదరణ ఉండేదని.. చాలా మంది ప్రతిభ గల ఆటగాళ్లను నేను చూశానని కెవిన్ అన్నాడు. టాలెంట్ ఉన్న ఆటగాళ్లు ఆ దేశంలో ఉన్నా అక్కడ ఏం జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. ఈ ఓటమిపై ఇప్పటికే చాలా మంది పాక్ మాజీ ఆటగాళ్లు విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే తొలి ఇన్నింగ్స్‌ను పాక్ 448/6 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. బంగ్లా 565 రన్స్‌కు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్ లో పాక్ 146 పరుగులకు ఆలౌట్ కాగా.. 30 పరుగుల స్వల్ప టార్గెట్ ను వికెట్ కోల్పోకుండా చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారీ సెంచరీ చేసిన ముష్ఫికర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లా 1%-%0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో మ్యాచ్ రావల్పిండి వేదికపైనే ఆగస్టు 30 నుంచి జరుగుతుంది.

# విండీస్ ఆటగాడు బలుపు పనులు.. ఔటయ్యాక ఏం చేసాడో తెలుసా..?

మాక్స్ 60 కరేబియన్ 2024 లీగ్ లో వెస్టిండీస్ ఆటగాడు కార్లోస్ బ్రాత్‌వైట్ హద్దుమీరి ప్రవర్తించడం హాట్ టాపిక్ గా మారుతుంది. న్యూయార్క్ స్ట్రైకర్స్, గ్రాండ్ కేమాన్ జాగ్వార్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో బ్రాత్‌వైట్ తన కోపాన్ని నియంత్రించుకోలేక విమర్శల పాలవుతున్నాడు. న్యూయార్క్ స్ట్రైకర్స్ తరపున ఆడుతున్న ఈ విండీస్ పవర్ హిట్టర్ ఇన్నింగ్స్ 9 ఓవర్లో జోషువా లిటిల్ బౌలింగ్ లో వికెట్ కీపర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఔటైన తర్వాత పెవిలియన్ బాట పట్టిన అతను తన చేతిలో ఉన్న హెల్మెట్ ను బ్యాట్ తో గట్టిగా కొట్టాడు. బ్రాత్‌వైట్ బలంగా కొట్టడంతో హెల్మెట్ చాలా దూరంలో వెళ్లి పడింది. దీంతో అక్కడ ఉన్నవారు ఒక్కసారిగా షాక్ అయ్యారు. అతని కోపానికి కారణం అంపైర్ ఔటివ్వడమే అని తెలుస్తుంది. లిటిల్ వేసిన బంతి అతని బ్యాట్ కు కాకుండా భుజాలకు తాకుతూ వికెట్ కీపర్ చేతిలో పడింది. దీంతో అతను 7 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అంపైర్ ఔట్ పై అసహనం వ్యక్తం చేసిన అతను డగౌట్ లో తన కోపాన్ని ప్రదర్శించాడు.



ఈ మ్యాచ్ లో బ్రాత్‌వైట్ టీం న్యూయార్క్ స్ట్రైకర్స్ 8 పరుగుల తేడాతో ఘనా విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూయార్క్ స్ట్రైకర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గ్రాండ్ కేమాన్ జాగ్వార్స్ 5 వికెట్లకు 95 పరుగులకు పరిమితమైంది. ఇక ఈ టోర్నీ విషయానికి వస్తే ఆదివారం (ఆగస్టు 25) జరిగిన ఫైనల్లో కరీబియన్ టైగెర్స్ 56 పరుగుల తేడాతో న్యూయార్క్ స్ట్రైకర్స్ పై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది.

# నాని హీరోయిన్.. ఒక్కసారిగా హీటెక్కించిందిగా!

బీచ్‌లో పూజా భాలేకర్ లుక్స్ దవడ పడిపోయాయి



నేచురల్ స్టార్ నాని పైసా సినిమా హీరోయిన్ గుర్తుందా? అదేనండీ సిద్ధికా శర్మ. ఆ మూవీలో అందం, అభినయంతో అలరించిన ముద్దుగుమ్మ.. అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అందుకోలేకపోయింది. ఇప్పుడు తెలుగు సినిమాలకు దూరంగా ఉంది. ఉత్తరాఖండ్ కు చెందిన అమ్మడు.. మూవీల్లోకి రాకముందు మోడల్ గా రాణించింది. మోడలింగ్ చేస్తున్న సమయంలో టాలీవుడ్ లో ఛాన్స్ దక్కించుకుంది. ఆల్ ది బెస్ట్ మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.జేడీ చక్రవర్తి, శ్రీకాంత్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది.

పైసా మూవీలో బాగా డబ్బున్న వ్యక్తి కుమార్తెగా కనిపించి తన యాక్టింగ్ తో మెప్పించింది. ఆ సమయంలో తన ఒరిజినల్ నేమ్ ను బయటపెట్టింది. సిద్ధిక బాగానే నటించినా.. సినిమా అనుకున్నట్లు హిట్ అవ్వలేదు. దీంతో ఒక్కసారిగా మాయమైంది అమ్మడు. సుమారు ఐదేళ్లపాటు ఎక్కడా కనిపించలేదు. ప్రేమ పరిచయం మూవీతో మళ్లీ రీఎంట్రీ ఇచ్చింది. కానీ ఆ సినిమా కూడా నిరాశపరిచింది.

అలా ఒక్క హిట్ అందుకోకుండానే ఆమె టాలీవుడ్ కెరీర్ ముగించింది.అయితే తెలుగు సినిమాలకు దూరంగా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటోంది. రకరకాల ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తుంటోంది. తన అందాలతో కుర్రకారు హృదయాలను దోచుకుంటూ ఉంటోంది. అలా తన ఫాలోవర్స్ ను పెంచుకుంటూ ఉంటోంది. గ్లామర్ డోస్ పెంచేసి ఫిదా చేస్తుంటోంది. తాజాగా సిద్ధికా శర్మ నయా పిక్స్ ను తన ఫ్యాన్స్ కోసం షేర్ చేసింది.

వైట్ ప్యాంట్ అండ్ బ్లూ కలర్ జాకెట్ వేసుకున్న అమ్మడు ఓ రేంజ్ లో ఉంది. హీట్ పుట్టించే అందాలతో ఒక్కసారిగా సెగలు పుట్టించింది. హెయిర్ లీవ్ చేసుకుని తన లుక్ తో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం అమ్మడు ఫోటో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పిక్ అదిరిపోయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. సో బ్యూటిఫుల్ అంటూ కొనియాడుతున్నారు.



ఆమ్నా షరీఫ్ మనోహరమైన భంగిమలు



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com